ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి జిల్లా వార్తలు
5
సోమవారం 30 సెప్టెంబరు 2024



తిరుమల లడ్డూ కల్తీపై నిరసన



ఏపీ మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న హిందూ సంఘాల నాయకులు

- భగ్గుమన్న హిందూ సంఘాల నాయకులు
- ఆమనగల్లులో భారీ ర్యాలీ
- ఏపీ మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మ దహనం

ఆమనగల్లు, సెప్టెంబరు 29 : తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించి అపవిత్రం చేయడాన్ని నిరసిస్తూ పట్టణంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, ఏబీవీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. హైదరాబాద్ -శ్రీశైలం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక రాజీవ్‌చౌక్ వద్ద ఏపీ మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కోట్లాదిమంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన సంఘటనపై సమగ్ర విచారణ చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లడ్డూ కల్తీ వ్యవహారానికి బాధ్యత వహించి జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో పాపిశెట్టి రాము, అంజయ్య, దొంతు విశ్వనాథం, ఆనంద్, తిరుపతయ్య, మాధవాచారి, మనో హర్, నిరంజన్, నరసింహ, ఎర్రవోలు మహేశ్, గోరటి నర్సింహ్మా, శేఖర్, లక్ష్మణ్, కృష్ణ, శ్రీకాంత్ సింగ్, శ్రీను, ఆనంద్, మహేశ్, కుమార్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను ఆపండి.. గోపాజీకుంటను పరిరక్షించండి



గోపాజీకుంటలో చేపట్టిన నిర్మాణాలను పరిశీలిస్తున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 29: నీటి పారుదలశాఖ అధికారులు అవినీతి మత్తు వీడి చెరువులు, కుంటలను పరిరక్షించాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కాశిరెడ్డిగూడ గ్రామ పంచాయతీ శివారులోని గోపాజీకుంటను ఆదివారం బక్కని సందర్శించారు. ఈ సందర్భంగా కుంటకు ఆనుకొని చేపట్టిన నిర్మాణాలను పరిశీలించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు చెరువులు, కుంటలు, పాటుకాలువలు, నదులు, వాగులను పరిరక్షించడానికి ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటుచేసి చర్యలు తీసుకుంటుంటే.. ఇక్కడ మాత్రం చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. నీటి పారుదల, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే గోపాజీకుంట అలుగుకు అడ్డంగా ఓ బ్యాటరీ పరిశ్రమను నిర్మించి, వ్యర్థాలను చెరువులోకి వదులుతున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే గోపాజీకుంటను పరిశీలించి, అక్రమంగా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని బక్కని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లింగారం కుమార్‌గౌడ్, జనార్ధన్‌గౌడ్, నాగయ్యగౌడ్, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి : బండి



యాచారంలో బీజేపీ నాయకులతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

యాచారం, సెప్టెంబరు 29 : బీజేపీ మరింత బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి యాచారం మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు కొప్పు బాషా నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రగతి కోసం కేంద్రం అత్యధిక నిధులు కేటాయిస్తుందని తెలిపారు. ఆయనను కలిసిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, గోగికార్ రమేష్ తదితరులున్నారు.

హైడ్రా పేరుతో పేదలను భయపెట్టొద్దు



లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, సెప్టెంబరు 29 : హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను కూల్చి వారిని నిరాశ్రయులను చేయొద్దని రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు ఇచ్చిన ఇళ్లను నేలమట్టం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కడ్తాల మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో పేదలను భయాందోళనకు గురి చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా హైడ్రా కూల్చివేతలు ఆపేసి పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. రాష్ట్రంలో గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే మూసి ప్రాంతంలో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చిందని గుర్తు చేశారు.

రైతులూ.. రుణాలు పొందండి

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 29: మండలంలోని మల్కారం పీఏసీఎస్ నుంచి రైతులు రుణాలు పొందాలని ఛైర్మన్ బుర్కుంట సతీశ్ తెలిపారు. పీఏసీఎస్ కార్యాలయంలో ఆదివారం సతీశ్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం లావాదేవీలు రూ.19 కోట్ల టర్నోవర్ అయినట్లు నిర్ధారించారు. రైతులు తీసుకున్న స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాలు పొందాలని ఛైర్మన్ అన్నారు. రుణాలతో పాటు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు, బ్యాంకింగ్ సేవలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. పంట రుణాలు రూ.20లక్షలు, దీర్ఘకాలిక రుణాలు రూ.3కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కాగా, పీఏసీఎస్ పరిధిలో 161 మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ మాఫీ చేయాల్సి ఉందని ఛైర్మన్ తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్, పాలకవర్గ సభ్యులు రవికాంత్‌రెడ్డి, పి.లక్ష్మి, కృష్ణారెడ్డి, శంకరయ్య, ముడావత్ రెడ్యా, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కనుమరుగు



ప్రైవేట్‌లో ఆపరేషన్ చేయించుకున్నా



కంటి వెలుగులో పరీక్షలు చేయించుకున్నాను. ఆపరేషన్ అవసరమని చెప్పారు. కానీ ఆపరేషన్ చేయించలేదు. మందులు రాసి అద్దాలు ఇచ్చి పంపారు. అయినా కళ్లు కనిపించ లేవు. దీంతో ఆపరేషన్ తప్పనిసరి అయ్యింది. నా కొడుకు హైదరాబాద్‌కు తీసుకెళ్లి ప్రైవేట్ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ చేయించాడు. నా లాంటి వారు ఎందరో ఆపరేషన్ కోసం ఎదురు చూస్తున్నారు.

- బంగారు సత్యమ్మ, తుమ్మలపల్లి, చౌదరిగూడ మండలం

'కంటి వెలుగు' వివరాలు

పంచాయతీలు	558
బృందాలు	80
వైద్య సిబ్బంది	640
2023 జూన్ వరకు కంటి వెలుగు నిర్వహించిన పంచాయతీలు	514
2023 జూన్ వరకు పరీక్షించిన వారి సంఖ్య	8,50,879
పంపిణీ చేసిన రీడింగ్ గ్లాసులు	1,05,379
40 ఏళ్లలోపు ఉన్నవారు	13,221
40 ఏళ్ల పైబడిన వారు	91,807
ప్రిస్క్రిప్షన్ కంటి అద్దాల కోసం గుర్తించినవి	95,057
పంపిణీ చేసిన ప్రిస్క్రిప్షన్ కంటి అద్దాలు	60,731
ఇంకా పంపిణీ చేయాల్సినవి	34,326

మూలన పడిన కేసీఆర్ కంటి అద్దాలు

- అద్దాల పేరుతో లక్షల రూపాయలు వృథా
- రెండో విడతలో అరకొర అద్దాలతో సరిపెట్టిన అధికారులు
- ఆపరేషన్ల కోసం అభాగ్యుల ఎదురుచూపు
- రేవంత్‌రెడ్డి సర్కారుపై ఆశలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'కంటి వెలుగు' పథకానికి చీకట్లు కమ్ముకున్నాయి. తొలి విడతలో ఈ పథకం కొంతమేర సక్సెస్ అయినప్పటికీ.. మలి విడతలో మసకబారింది. కంటి పరీక్షల కోసం కోసం ఐదు, పది గ్రామాలకు కలిపి ఒకచోట శిబిరం ఏర్పాటు చేశారు. ప్రతీ నలుగురిలో ఒకరికి కంటి సమస్య ఉన్నట్లు వైద్య బృందం గుర్తించింది. దగ్గరి చూపు సమస్య ఉన్నవారికి రీడింగ్ అద్దాలు ఇవ్వగా.. దూరపు చూపు, ఇతర దృష్టి సమస్య అధికంగా ఉన్నవారికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ కోసం రెఫర్ చేసి ఆర్డర్ చేశారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో అధికారులంతా ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. కంటి వెలుగు పథకంలో భాగంగా రెండో విడతలో కంటి పరీక్షలు చేసుకొని ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ కోసం చాలామంది ఎదురు చూశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పథకం ఆగిపోయింది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్డర్ చేసిన ప్రిస్క్రిప్షన్ గ్లాస్‌లు వచ్చాయి. కంటి పరీక్షలు చేసే సమయంలో బాధితుల నుంచి సిబ్బంది సరైన అడ్రస్‌లు తీసుకోకపోవడం, కంప్యూటర్‌లో వివరాలు పూర్తి స్థాయిలో అప్‌డేట్ చేయకపోవడంతో అవి లబ్ధిదారులకు చేరలేదు. మిగిలిన అద్దాలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కుప్పలు తెప్పలుగా ఓ మూలకు మూలుగుతున్నాయి. కంటి పరీక్షలు చేయడంలో కీలకమైన స్టాండ్స్ పరిస్థితి కూడ ఇదే తరహాలో మూలన పడి ఉన్నాయి. వర్షపు నీరంతా కంటి అద్దాల బాక్సులపై పడి అవి పాడవుతున్నాయి. అలాగే డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వివిధ రకాల ట్యాబ్లెట్స్ నెలల తరబడి నిలువ ఉంచడంతో పాడవుతున్నాయి. మందుల వినియోగ గడువు తీరిపోయాక గుట్టుచప్పుడు కాకుండా కాల్చేస్తున్నారు.



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వృథాగా పడి ఉన్న కంటి వెలుగు అద్దాల బాక్సులు

తూతూ మంత్రంగా..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 ఆగస్టు 15న 'కంటి వెలుగు' పథకాన్ని ప్రారంభించింది. 2023 జనవరి 18 నుంచి రెండో విడతలో కంటి పరీక్షలు నిర్వహించింది. వంద రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగింది. దృష్టి సమస్య తీవ్రంగా ఉన్న వారికి ఆపరేషన్ చేయాల్సి ఉన్నా.. సరోజిని ఆసుపత్రికి వెళ్లి ఆపరేషన్ చేయించుకోవాల్సిందిగా సూచించి చేతులు దులిపేసుకున్నారు. దీంతో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో కేవలం అద్దాలతోనే సరిపెట్టారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని పట్టించుకోలేదు.

కంటి సమస్యకు అద్దాలే..

జిల్లాలో 558 గ్రామ పంచాయతీల్లో 80 బృందాలు.. 640 వైద్య సిబ్బంది.. వంద రోజుల పాటు శిబిరాలను నిర్వహించారు. 8,50,879 మందికి కంటి పరీక్షలు చేశారు. దగ్గరి చూపు సమస్య ఉన్నవారు 1,05,379 మందిని గుర్తించి రీడింగ్ గ్లాసులు అందించారు. 95,057 మందికి ఇతరత్రా కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 60,731 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ ఇవ్వగా.. 34,326 మందికి అద్దాలు ఇవ్వాల్సి ఉంది. అంతలోనే శాసన సభ ఎన్నికలు రావడంతో ఈ పథకానికి బ్రేక్ పడింది.

పరీక్షలకే పరిమితం

అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కంటి వెలుగు -2 కార్యక్రమంలో ఆపరేషన్ల ఊసే ఎత్తలేదు. ఆపరేషన్లు అవసరమైన వారి గురించి పట్టించుకోలేదు. కొందరికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ ఇచ్చారు కానీ.. కంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపలేదు. తీవ్రమైన కంటి సమస్యలు ఉన్నవారికి ట్యాబ్లెట్లు ఇచ్చి పంపించారు. ఆపరేషన్లు అవసరం ఉన్నవారి వివరాలను వైద్యాధికారులు నమోదు చేయలేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వమైనా స్పందించి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించాలని కోరుతున్నారు.

కంటి ఆపరేషన్ల కోసం నిరీక్షణ

మొదటి విడతలో కంటి పరీక్షలు చేయించుకున్నవారు చాలా మంది ఆపరేషన్ల కోసం ఇప్పటికీ ఎదురు చూస్తున్నారు. కంటి శుక్లం, బిందువు, పొర, మెల్లకన్ను తదితర లోపాలున్న వారిని ఆసుపత్రులకు రెఫర్ చేసి శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉంది. దీని కోసం జిల్లా వ్యాప్తంగా 25 వరకు నోడల్ ఆసుపత్రులను ప్రభుత్వం గుర్తించింది. ఇందులో ఒకటి రెండు మినహా అన్నీ ప్రయివేట్ ఆసుపత్రులే ఉన్నాయి. మొదటి విడతలో 8,60,898 కంటి పరీక్షలు చేయించుకున్నారు. అందులో 58,230 శస్త్ర చికిత్స అవసరం ఉన్నట్లు గుర్తించారు. 8 వేల మంది రోగులకు శస్త్ర చికిత్సలు జరిపారు. ఇంకా 50,230 మంది రోగులకు శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉంది. శస్త్ర చికిత్స కోసం గుర్తించబడ్డ బాధితులు ఎదురు చూస్తున్నారు. ఆర్థికంగా ఉన్న కొందరు రోగులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్సలు చేయించుకున్నారు. నిరుపేద రోగులు శస్త్ర చికిత్సల కోసం ఎదురు చూస్తున్నారు. కొంత మంది వృద్ధులు ఎదుచూసి చివరకు ఆపరేషన్ చేసుకోకుండానే మృతి చెందారు.



కంటి వెలుగు అద్దాల బాక్సులు

'ఫార్మా' రద్దుకు పోరుబాట

- మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఆందోళనకు సిద్ధమవుతున్న రైతులు
- కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలు, ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరిక



మేడిపల్లిలో ఫార్మాసిటీని వ్యతిరేకిస్తూ నిర్మించిన గద్దె వద్ద నిరసన తెలుపుతున్న రైతులు(ఫైల్)

యాచారం, సెప్టెంబరు 29 : యాచారం మండల పరిధిలో ఫార్మాసిటీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల తోపాటు అనుబంధ గ్రామాల రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికి రెడీ అవుతున్నారు. ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే ఫార్మాసిటీ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసిందని ఆరోపిస్తూ కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలు, ప్రజాభవన్‌ను ముట్టడించాలని ఆయా గ్రామాల రైతులు, యువజన సంఘాల నాయకులు నిర్ణయించారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీకి సంబంధించి 2016 జూన్ 10న పరిశ్రమల శాఖ జారీచేసిన జీవో 31 రద్దు కాలేదని పత్రికలలో వచ్చిన వార్తలు వచ్చాయి. ఇవి చూసిన రైతులు ఆందోళనలతోనే ఫార్మాసిటీని అడ్డుకోవాలని నిర్ణయించుకున్నారు.

భూసేకరణకు సహకరించాలని ఫోన్లు

భూసేకరణకు సహకరించాలని కొంతకాలంగా రెవెన్యూ అధికారులు ఫోన్లు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. అథారిటీలో జమ చేసిన డబ్బు తీసుకొని ఫార్మాసిటీకి భూములు ఇవ్వాలని అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు.

రద్దు కోరుతూ వినతులు

ఫార్మాసిటీ రద్దు చేయాలని మాజీ సర్పంచులు రాజశేఖర్‌రెడ్డి, ఎం.వెంకటరెడ్డితో పాటు రైతులు వినోద్‌రెడ్డి, మహేందర్ తదితరులు ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు వినతి పత్రం అందించారు. అదేవిధంగా బాధిత రైతులు ఇటీవల కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలకు పోస్టుకార్డులు రాసి పంపించారు. వీటిపై ఎవరూ స్పందించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని, అధికార పార్టీ నేతలను గ్రామాల్లో తిరగనీయమని హెచ్చరిస్తున్నారు.

కోర్టులో కేసు..

కాగా, మేడిపల్లిలో 483 ఎకరాల 25గుంటలు, నానక్‌నగర్‌లో 154ఎకరాల 16గుంటలు, తాటిపర్తిలో 382 ఎకరాల 33గుంటలు, కుర్మిద్దలో 974 ఎకరాల 6 గుంటల భూములకు సంబంధించి కోర్టులో కేసులు ఉన్నాయి. ఇదిలా ఉండగానే ఆయా గ్రామాల్లో 9,851 ఎకరాల భూములను సేకరించడానికి రెవెన్యూ, టీఎస్ ఐఐసీ ఉన్నతాధికారులు గుట్టుగా పావులు కదుపుతున్నారు. ఇప్పటికే యాచారం మండలంలో 8వేల ఎకరాల వరకు, పట్టా, అసైన్డ్ భూములు సేకరించారు.

నిషేధిత జాబితాలో పట్టా భూములు

కుర్మిద్దలో 974ఎకరాల 4గుంటలు, నానక్‌నగర్‌లో 154ఎకరాల 16గుంటలు, తాటిపర్తిలో 382ఎకరాల 33గుంటలు, మేడిపల్లిలో 483ఎకరాల 25 గుంటల భూమిని గత ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చింది. దీంతో పట్టా భూమి ఉన్నా నిరుపేదలుగా మిగిలామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే, భువనగిరి ఎంపీల విన్నవించినా తమకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా తమ గోడు వినిపించుకొని న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్



అధికారంలోకి రాగానే ఫార్మాసిటీ రద్దు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రైతులను నమ్మించింది. మేనిఫెస్టోలో కూడా ప్రకటనలు చేసింది. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఫార్మాసిటీ ఎందుకు రద్దు చేయడం లేదు. నిషేధిత జాబితాలో ఉన్న భూములకు విముక్తి కల్పించి ఆదుకుంటామని మాట ఇచ్చి తప్పింది. ఫార్మాసిటి రద్దుచేయకుంటే ఉధృతంగా ఆందోళనలు చేస్తాం. అంతేకాకుండా సెంటు భూమి లేని వారికి పరిహారం ఇచ్చిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలి.

- దంతుక పెద్దయ్య, నానక్‌నగర్ మాజీ సర్పంచ్

శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు

కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఏర్పాట్లు



కన్యకా పరమేశ్వరి దేవాలయం

ఆమనగల్లు , సెప్టెంబరు 29: పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. అక్టోబరు 3వ నుంచి 13వ తేదీ వరకు కొనసాగే వేడుకలకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. రోజుకొక అలంకారంతో 11రోజులు దేదీప్యమానంగా అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. నిత్యం యజ్ఞం, హోమం, అభిషేకాలు, నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి బికుమాండ్ల నర్సింహ్మా, కోశాధికారి బికుమాండ్ల శ్రీనివాస్ తెలిపారు. మండల ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీక్లబ్, వాసవి వనితాక్లబ్, వాసవీ సీనియర్ సిటీజన్ క్లబ్, ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ఉత్సవాల వివరాలు



3వ తేదీన బాలాత్రిపుర సుందరి దేవి అలంకారం, గణపతి పూజ, అమ్మవారికి అభిషేకం, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, 4న ధనలక్ష్మీదేవిగా, 5న అన్నపూర్ణ దేవిగా, 6న గాయత్రీ దేవిగా, 7న శాకాంబరి దేవిగా, 8న లలితాదేవిగా, 9న సరస్వతి దేవిగా, 10న దుర్గా దేవిగా, 11న మహిషాసురమర్ధిని దేవిగా, 12న విజయ దశమి సందర్భంగా రాజరాజేశ్వరీ దేవిగా, 13న దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారు. అలాగే అమ్మవారి ఊరేగింపు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సీసీ రోడ్డు పనులు.. దారి మళ్లింపు

కుషాయిగూడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : చర్లపల్లి డివిజన్ పరిధిలోని రామకృష్ణా నగర్‌లో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నందున దారి మూసివేస్తున్నట్లు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, కాప్రా సర్కిల్ ఇంజినీరింగ్ అధికారులు ఆదివారం తెలిపారు. కాలనీలోని రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమైనందున చర్లపల్లి నుంచి నాగారం వైపు వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని వారు సూచించారు. కనీసం పది రోజుల పాటు ఈ రామకృష్ణా నగర్ మీదుగా నాగారం వైపు రాకపోకలు సాగించే వారు ఈ విషయాన్ని గమనించి తమతో సహకరించాలని వారు కోరారు.

బీజేపీ సభ్యత్వం పొందాలి



ఇప్పాయిపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదులో మారుతి కిరణ్

కులకచర్ల, సెప్టెంబరు 29: సుస్థిర భారత్ కోసం బీజేపీ సభ్యత్వం పొందాలని బీజేపీ పరిగి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మారుతికిరణ్ తెలిపారు. మండలంలోని ఇప్పాయిపల్లిలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిందని మారుతి కిరణ్ తెలిపారు. మోదీ నాయకత్వాన్ని ప్రపంచ దేశాలు స్వాగతిస్తున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న ఎర్రోళ్ల రాఘవేందర్

కడ్తాల్, సెప్టెంబరు 29 : రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ సూచించారు. కడ్తాల మండల కేంద్రంలోని తలకొండపల్లి చౌరస్తాలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి పక్కన వర్షపు నీటి పారుదల కోసం నిర్మించిన కాల్వపై స్లాబ్ దెబ్బతిని గోతులు ఏర్పడి నెలల కాలంగా ప్రజలు ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఈ విషయాన్ని రాఘవేందర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ దృష్టికి తీసుకుపోవడంతో జాతీయ రహదారుల శాఖ అధికారులు మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈమేరకు ఆదివారం సాయంత్రం యువజన సంఘాల నాయకులతో కలిసి రాఘవేందర్ పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రంగయ్య, నాయకులు భిక్షపతి యాదవ్, క్యామ మహేష్, కుమార్, శేఖర్, ఇమాన్‌బాబా తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా సీసీ రోడ్డు పనులు



కులకచర్లలో కొనసాగుతున్న రోడ్డు పనులు

కులకచర్ల, సెప్టెంబరు 29: కులకచర్లలో రెండు సంవత్సరాలుగా నిలిచిపోయిన డబుల్ సీసీ రోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కులకచర్ల చౌరస్తా నుంచి కింది పశువుల ఆసుపత్రి వరకు డబుల్ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.2.80 కోట్లు మంజూరయ్యాయి. అప్పట్లో కాంట్రాక్టర్ ఓ వైపు కిలోమీటర్ మేర సీసీ రోడ్డు వేసి మరోపక్క వదిలేశాడు. రెండు సంవత్సరాలుగా ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవతో కాంట్రాక్టర్ మళ్లీ పనులు మొదలుపెట్టాడు. దాంతో సీసీ రోడ్డు పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా, పనుల్లో నాన్యతా ప్రమాణాలు పాటించడం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వెలువడుతున్నాయి.

తిరుమల లడ్డూ కల్తీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : వీహెచ్‌పీ

వికారాబాద్, సెప్టెంబరు 29 : తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదం కల్తీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు బందెప్పగౌడ్, ప్రశాంత్‌కుమార్, జిల్లా కార్యదర్శి శ్రీలతారెడ్డి సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. దేవాదాయ శాఖను వెంటనే రద్దు చేయాలని, తదితర డిమాండ్‌లతో వీహెచ్‌పీ రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో నేడు(సోమవారం) స్థానిక రామమందిరం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించడం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీలో హిందూ బంధువులందరు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు.


నాటక సమాఖ్య జిల్లా కమిటీ



జిల్లా కమిటీ సభ్యులు

పరిగి, సెప్టెంబరు 29: తెలంగాణ నాటక సమాఖ్య రాష్ట్ర కమిటీకి అనుబంధంగా వికారాబాద్ జిల్లా కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం పరిగిలోని పల్లవి కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా అధ్యక్షుడిగా బి.నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.జగన్, కోషాధికారిగా ఎం.సత్యనారాయణరెడ్డితోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాటక సమాఖ్య రాష్ట్ర కమిటీ ప్రచార కార్యదర్శి వి.రాజు, ఉపాధ్యక్షుడిగా సోమా అంజిరెడ్డి, మాలేల అంజిలయ్యగౌడ్, కోషాధికారిగా సూర్యవర్ధన్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా సిరిగిరి రామాచారి తదితరులను ఎన్నుకున్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం



చైర్మన్ రాజేశ్‌రెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

కొడంగల్, సెప్టెంబరు 29: వికారాబాద్ జిల్లా నూతన గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఆదివారం బొంరాస్‌పేట్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, సీనియర్ నాయకులు వెంకట్రాములు, రామచంద్రారెడ్డి, నర్సిములునాయుడు, గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మహిపాల్, కాశప్ప, నాయకులు మెరుగు వెంకటయ్య, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం గారూ..
డిమాండ్లు ఏమయ్యాయి!

- ఏడేళ్ల క్రితం ప్రతిపక్ష హోదాలో తాండూరు వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన రేవంత్‌రెడ్డి
- కంది బోర్డు ఏర్పాటుతో పాటు కందులకు బోనస్‌పై అప్పటి ప్రభుత్వం దృష్టికి..
- నేడు ముఖ్యమంత్రిగా ఎలా స్పందిస్తారని ఆశగా ఎదురుచూస్తున్న కొడంగల్, తాండూరు కంది రైతులు



తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి(ఫైల్)

తాండూరు, సెప్టెంబరు 29 : తాండూరు వ్యవసాయ మార్కెట్‌కు తాండూరు నియోజకవర్గమే కాకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం నుంచి కూడా పెద్దఎత్తున రైతులు, తాము పండించిన కందుల క్రయ విక్రయాలకు తాండూరు వ్యవసాయ మార్కెట్‌కు తీసుకు వస్తుంటారు. అయితే, కంది రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని 2017 జనవరిలో తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డును తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో రేవంత్‌రెడ్డి సందర్శించారు. కంది రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తాండూరు వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి తాను కంది రైతుల కోసం సలహాలు, సూచనలు ఇచ్చేందుకే మార్కెట్‌కు వచ్చానని, దీన్ని రాజకీయ కోణంలో ఆలోచించరాదని రేవంత్‌రెడ్డి మార్కెట్ అధికారులకు సూచించారు. కర్ణాటక తరహా కందులపై రూ.450 బోనస్ ఇవ్వాలని, కందుల కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్‌లోనే ఏర్పాటు చేయాలని, కంది బోర్డు కూడా ఏర్పాటు చేయాలని అప్పట్లో ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసనసభలో కూడా ఈ విషయాన్ని ప్రస్తావిస్తానని చెప్పారు. కొడంగల్ కందులు కర్ణాటక రాష్ట్రం సేడంకు తరలిపోతున్నాయని అప్పట్లో రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ప్రస్తుతం ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిగారే కొనసాగుతున్నందున కందిపై ఏ విధంగా స్పందిస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా తాండూరు, కొడంగల్ ప్రాంతా రైతులు రాష్ట్రంలోనే కందిని అత్యధికంగా పండిస్తారు. తాండూరులో కంది బోర్డు ఏర్పాటు విషయం కొన్నేళ్లుగా ప్రతిపాదనలోనే ఉంది. హామీలు ఇవ్వడమే తప్ప అమలుకు నోచుకోలేదు. మరో రెండు నెలల్లో కందుల సీజన్ రాబోతున్నందున అప్పట్లోగా కందిపై బోనస్, కందుల కొనుగోలు కేంద్రం వంటి వాటిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. తాండూరులో కంది బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా వెళ్లాయి. కంది బోర్డు ఏర్పాటుకు దాదాపు రూ.50 కోట్ల మేర నిధులు అవసరమని అంచనా కూడా వేశారు. ఒకవేళ ఇక్కడ కంది బోర్డు ఏర్పాటయితే రైతులు ఏ రకం విత్తనాలను విత్తుకోవాలి, ఎలాంటి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి? ఇతర రాష్ట్రాలలో కందుల ధరలు ఏ విధంగా ఉన్నాయి? ఎప్పటికప్పుడు కందులపై నిరంతర పరిశోధనలు చేసే అవకాశాలు ఉంటాయి. తాండూరు వ్యవసాయ మార్కెట్లో ప్రతీ సంవత్సరం లక్ష క్వింటాళ్ల కందుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. కాగా, తాండూరు కంది పప్పుకు భౌగోళిక గుర్తింపు(జియోగ్రాఫికల్ ఇండికేషన్) కూడా లభించింది.



మార్కెట్‌లో అధికారులతో కందుల క్రయ విక్రయాల వివరాలు తెలుసుకుంటున్న రేవంత్‌రెడ్డి (ఫైల్)



మిరాలం కుంటలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి, తదితరులు

జలవనరులను కాపాడుకోవాలి

పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 29: జలవనరులను కాపాడుకునేందుకు ప్రతీఒక్కరు సహకరించాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ మిరాలం కుంటలో ఇన్ఫోసిస్ సంస్థ ఆధ్వర్యంలో చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పూర్వం తాగు, సాగునీటి వనరులు చెరువులు, కుంటలు, వాగులు, నదులేనని గుర్తుచేశారు. నేడు చెరువులు, కుంటలు ఆక్రమణకు గురౌతున్నట్లు తెలిపారు. అయితే, అవి మరోపక్క మురుగు, రసాయన కాలుష్యంతో నిండిపోతున్నాయని, ఇది మానవాళికి ఎంతో ప్రమాదమన్నారు. చెరువులు, కుంటల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రజల సహకారం కూడా అవసరమని ఆయన అన్నారు. ఇన్ఫోసిస్ సంస్థ ఆధ్వర్యంలో గతంలోనూ చెత్తను తొలగించినట్లు గుర్తుచేశారు. మిరాలం కుంటలో వ్యర్థాలు, మురుగు కలువకుండా ప్రత్యేక కాలువను నిర్మించేందుకు కృషి చేస్తామని సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కౌన్సిలర్ సుర్వీ రవీందర్, నాయకులు శేఖర్, బాల్‌రెడ్డి, కాశయ్య, నర్సింహ, ఇన్ఫోసిస్ ప్రతినిధులు వంశీ, రాజశేఖర్, కార్తీక్, ఆదిత్య, సుమంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాపయ్యగౌడ్

రైతు దీక్షను జయప్రదం చేయాలి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 29: కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల ముందు రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాలంటూ నేడు (సోమవారం) బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద నిర్వహించతలపెట్టిన 24 గంటల రైతు దీక్షను జయప్రదం చేయాలని కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్యగౌడ్ కోరారు. నేడు ఉదయం 11 గంటల నుంచి మంగళవారం ఉదయం 11 గంటల వరకు దీక్ష ఉంటుందన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రూ.2 లక్షల్లోపు రైతు రుణమాఫీ చేస్తామని తుక్కుగూడ వద్ద జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ సమక్షంలో రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారని, నేటికీ పూర్తిస్థాయిలో మాఫీ చేయలేకపోయారంటూ విమర్శించారు. రుణ మాఫీకి 62 లక్షల మంది అర్హులు కాగా.. ఇప్పటికి కేవలం 18లక్షల మందికే మాఫీ జరిగిందని గుర్తుచేశారు. రైతు భరోసా రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12వేల హామీ ఊసే లేదన్నారు. వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించినా అమలుకు నోచుకోలేదన్నారు. రుణమాఫీ నుంచి తప్పించుకోవడానికే హైడ్రాను తెచ్చారని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా హైడ్రా పేరుతో ఇళ్లు, ఇతర కట్టడాలు కూల్చివేయడం తగదన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలకు అనుమతులిచ్చిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి తుమ్మిడి వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జక్కు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రంగారెడ్డితో మాల్ గ్రామస్తులు

మాల్ బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలి

యాచారం, సెప్టెంబరు 29 : మండలంలోని మాల్ బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి ప్రయాణికులకు ఇబ్బందులు తొలగించాలని మాల్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 40 ఏళ్లుగా బస్టాండ్ వృథాగా ఉందని, అందులో నిర్మించిన దుకాణ సముదాయాలను కొంతమంది కబ్జా చేసుకుంటున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. రూ.4కోట్ల విలువైన బస్టాండ్‌ను కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి బస్సులు ఆగేటట్లు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డీఎం వెంకటనర్సప్పను ఫోన్‌లో ఆదేశించారు. దసరా వరకు బస్టాండ్‌లో బస్సులు ఆగేటట్లు చూడాలని డీఎంను ఆదేశించారు. విలువైన స్థలం ఉన్నా ఎందుకు వినియోగించుకోవడం లేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. తాను త్వరలో బస్టాండ్‌ను సందర్శించనున్నట్లు రంగారెడ్డి నాయకులతో చెప్పారు. కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ గజ్జి రామకృష్ణయాదవ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మీపతిగౌడ్, నాయకులు బుచ్చిరెడ్డి, రవీందర్, లిక్కి జంగారెడ్డి తదితరులు ఉన్నారు.

హైడ్రా బాధితులకు బీఆర్ఎస్ మద్దతు

షాబాద్, సెప్టెంబరు 29 : హైడ్రా బాధితులకు మద్దతుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం ఆదివారం రాజేంద్రనగర్ మండల పరిధిలోని హైదర్‌షా కోట్, మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా షాబాద్ మండల మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని అవినాష్‌రెడ్డి ఆరోపించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో అవినాష్‌రెడ్డి తదితరులు

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్

బీజేపీ ఆధ్వర్యంలో కీసరలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగటా జిల్లా స్వచ్ఛ భారత్ కన్వీనర్ చినింగని సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం కీసర అంబేడ్కర్ చౌరస్తాలో నాయకులు, కార్యకర్తలు ఉదయం రోడ్లపై ఉన్న చెత్తాచెదారం తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.

- కీసర, సెప్టెంబరు 29




కొత్త అధ్యక్షులు వచ్చేనా?

- బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ముగ్గురు అధ్యక్షులు గౌడవెల్లి గ్రామస్తులే
- గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో విలీనమైన గౌడవెల్లి
- దీంతో కొత్త వారిని నియమించాలని స్థానిక నేతల పట్టు
- అధిష్ఠానం చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 29 : మండలంలోని గౌడవెల్లి గ్రామ పంచాయతీని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో విలీనం చేయటంతో ప్రధాన రాజకీయ పార్టీల్లో తమ పార్టీ మండలాధ్యక్షుల గురించి చర్చ మొదలైంది. ప్రధాన పార్టీలకు చెందిన ముగ్గురు మండలాధ్యక్షులు గౌడవెల్లికి చెందిన వారు కావటంతో ఈ ముగ్గురు నేతలు రూరల్ మండలాధ్యక్ష పదవులకు రాజీనామా చేస్తారా! లేక యథావిధిగా కొనసాగుతారా? అని సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు. ఇటీవల మండలానికి చెందిన నాలుగు గ్రామాలను మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో విలీనం చేసిన విషయం తెలిసిందే. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో విలీనం చేసిన గౌడవెల్లికి చెందిన నాయకులు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లకు మండలాధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. దాంతో ఈ ముగ్గురు నేతలకు రూరల్ మండలంతో రాజకీయ ప్రమేయం ఉండబోదని సొంత పార్టీల నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు. మూడు ప్రధాన పార్టీల నేతలు తమ అధ్యక్ష పదవులకు ఎప్పటికైనా రాజీనామా చేయక తప్పదని ఆయా పార్టీల నాయకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా రమణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా దయానంద్ యాదవ్, బీజేపీ అధ్యక్షుడిగా నరేందర్‌రెడ్డిలు ఉన్నారు. ఈ ముగ్గురు నేతల గురించే ప్రస్తుతం సర్వత్రా జోరుగా చర్చ జరుగుతోంది. నేతలు రాజీనామా చేస్తే ఆ స్థానాన్ని దక్కించుకోవటానికి కొందరు నేతలు సమయం కోసం ఎదురు చూస్తున్నట్లు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. ఇంచుమించు మూడు ప్రధాన పార్టీల్లో ఈ చర్చ ఊపందుకోవటంతో అధ్యక్ష పదవి రేసులో తాను ఉన్నట్లు కొందరు నేతలు ఇప్పటికే ప్రచారం చేసుకుంటున్నారు. ప్రస్తుతం అధ్యక్షులుగా ఉన్న మూడు ప్రధాన పార్టీల నేతలు మండలంతో సంబంధం లేని నేతలుగా పలువురు భావిస్తున్నారు. అయితే, 14 గ్రామ పంచాయతీలతో మేడ్చల్ రూరల్ మండలం ఉన్నందున.. ఈ గ్రామాలకు చెందిన నాయకుడే తమ అధ్యక్షుడిగా ఉండాలని మూడు పార్టీల్లో చర్చ కొనసాగుతోంది. ప్రభుత్వం ఒక వైపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణ కోసం సన్నద్ధమవుతున్నందున సాధ్యమైనంత త్వరగా తమ పార్టీకి కొత్త అధ్యక్షుడిని నియమించాలని ఇప్పటికే కొన్ని గ్రామాల నేతలు పార్టీ పెద్దలతో చెప్పినట్టు సమాచారం. మూడు పార్టీల పరిస్థితి ఒకే మాదిరిగా ఉన్నందున ఏ పార్టీ ముందుగా కొత్త అధ్యక్షుడిని నియమిస్తుందోనని కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు. పార్టీ అధ్యక్షులను మార్చే విషయంలో ఆయా పార్టీల్లో స్పష్టత లేనప్పటికీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తల్లో చర్చలు తారాస్థాయికి చేరుకున్నాయి. అధికార కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం డబిల్‌పూర్, ఎల్లంపేట గ్రామాలకు చెందిన కొందరు నేతలు పోటీ పడుతుండగా, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం డబిల్‌పూర్, రావల్‌కోల్, బీజేపీ తరఫున ఎల్లంపేట, నూతన్‌కల్ సమాచారం. మొత్తానికి మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనం.. అందులో మూడు పార్టీలకు చెందిన పార్టీ అధ్యక్షులు ఒకే గ్రామానికి చెందినవారు కావటంతో కొత్త రాజకీయ చర్చకు తెరలేపినట్లైంది.



దయానంద్ యాదవ్



రమణారెడ్డి



నరేందర్‌రెడ్డి

దేవీ శరన్నవరాత్రోత్సవాలకు మైసిగండి
శివరామాలయం ముస్తాబు




దసరా ఉత్సవాలకు ముస్తాబైన మైసిగండి శివరామాలయం; ఆలయంలో అమ్మవారి మూలవిరాట్టు

కడ్తాల్, సెప్టెంబరు 29: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, పర్యాటక కేంద్రంగా బాసిల్లుతున్న కడ్తాల మండలం మైసిగండిమైసమ్మ, శివరామ, అన్నపూర్ణేశ్వరి, మహాలక్ష్మి, సరస్వతీదేవి ఆలయాలు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఏటా దసరా ఉత్సవాలు ఇక్కడ వైభవంగా నిర్వహిస్తారు. ఈ సారి అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా నలు మూలల నుంచి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, యాదాద్రి, నల్లగొండ, మెదక్, నిజామాబాద్,

అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు దసరా ఉత్సవాల నిర్వహణ

ఉమ్మడి మహబూబ్‌నగర్, సంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు. మైసిగండి శివాలయం వద్ద పదిరోజులు శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తారు. ఆలయం వద్ద పందిళ్లు, తాగునీటి వసతి ఏర్పాట్లు చేస్తున్నారు. లైట్లతో ఆలయాన్ని అలంకరిస్తున్నారు. దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటుచేస్తున్నారు. కల్వకుర్తి, ఆమనగల్లు, హైదరాబాద్ ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నారు.




సిరోలి పంతూ స్నేహలత-ఈఓ

ఆలయానికి చేరే మార్గం

హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే రోడ్డులో మైసిగండి మైసమ్మ ఆలయం వెనుక శివరామాలయాలున్నాయి. హైదరాబాద్‌కు 45 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. ఇక్కడికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రవాణా సౌకర్యాలున్నాయి. వాహనాల పార్కింగ్ స్థలం ఉంది. భక్తులకు ఆలయం వద్ద తాగునీటి, ఇతర వసతుల కల్పించారు.

వైశిష్ట్యం కలిగిన చారిత్రక కోనేరు

మైసిగండి శివాలయం ముందు భాగంలో ఉన్న కోనేరు గంగ సమతుల్యతను సంతరించుకుంది. దీనిలో స్నానాలాచరిస్తే పాపాలు తొలుగుతాయని భక్తుల నమ్మకం. వందల ఏళ్ల నాటి కోనేరు శిథిలావస్థకు చేరుకోగా పదేళ్ల క్రితం రూ.50లక్షలు వెచ్చించి మళ్లీ మరమ్మతులు చేయించి ఆధునికీకరించారు.

ఉత్సవాల వివరాలు

మైసిగండి శివరామాలయాల వద్ద అక్టోబరు 3వ తేదీ నుంచి కొనసాగే శరన్నవరాత్రోత్సవాల వివరాలను టెంపుల్ ఫౌండర్ ట్రస్టీ రమావత్ సిరోళి పంతూ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్నేహలత వివరించారు. 3న అన్నపూర్ణాదేవి అలంకారం, 4న బాలాత్రిపురసుందరిదేవి అలంకారం, 5న శ్రీగాయత్రి దేవిగా అమ్మవారి అలంకారాలు ఉంటాయి. 6న భవానీదేవిగా, 7న లలితత్రిపురసుందరీ దేవిగా, 8న మహాలక్ష్మీదేవిగా, 9న సరస్వతి దేవిగా, 10న దుర్గాదేవి అలంకరణలో, 11న మహిషాసుర మర్ధినిగా అమ్మవారు దర్శనమిస్తారు. 12న రాజరాజేశ్వరీదేవిగా అలంకరిస్తారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని సిరోళి పంతూ, స్నేహలత కోరారు.

క్రైం కార్నర్

దూసుకొచ్చిన వాహనం.. వ్యక్తి దుర్మరణం



శ్రీను మృతదేహం

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 29: తమ్ముడికి కొడుకు పుట్టాడన్న సంతోషంతో స్వగ్రామానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదంలో మృతిచెందాడు. స్వగ్రామం నుంచి తిరుగు ప్రయాణంలో రాత్రిపూట రోడ్డు పక్కన పడుకోగా గుర్తుతెలియని వాహనం అతడిపైనుంచి వెళ్లడంతో మృతిచెందిన సంఘటన షాద్‌నగర్ టోల్ ప్లాజా వద్ద శనివారం రాత్రి జరిగింది. ఏఎస్సై రాంచంద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం మంగనూరుకు చెందిన గోపాసు శ్రీను(36) హైదరాబాద్ అంబర్‌పేటలో సెంట్రింగ్ కూలీగా పనిచేస్తుంటాడు. గ్రామంలో తమ్ముడికి కొడుకు పుట్టడంతో శుక్రవారం గ్రామానికి వెళ్లాడు. అక్కడి నుంచి సాయంత్రం బయల్దేరాడు. చీకటి పడటంతో రాయికల్ టోల్ ప్లాజా వద్ద బైక్ రోడ్డ పక్కన పార్క్ చేసి నిద్రపోయాడు. అయితే గుర్తుతెలియని వాహనం అతడిపై నుంచి వెళ్లింది. దాంతో శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి తమ్ముడు రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. శిశువు మృతి



మృతిచెందిన శిశువు

కేశంపేట, సెప్టెంబరు 29: అనారోగ్యంతో ఉన్న శిశువును తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో శిశువు మృతిచెందిన సంఘటన కంకిరాళ్ల తండాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వక్డావత్ రమేష్ పద్మలకు 45 రోజుల కింద కుమారుడు జన్మించాడు. శిశువుకు మహేందర్ అని పేరుపెట్టారు. కాగా శిశువు శనివారం అనారోగ్య బారినపడగా అదే రోజు రాత్రి శిశువు తల్లితండ్రులు చికిత్స నిమిత్తం బైక్‌పై నిర్దవెల్లి గ్రామానికి తీసుకువెళ్తున్నారు. మార్గమధ్యలో బొదునంపల్లి గేట్ సమీపంలో ఎదురుగా వచ్చిన మరో బైక్ వీరిని ఢీకొట్టింది. దీంతో రెండు బైక్‌లపై ఉన్న వారికి గాయాలయ్యాయి. శిశువు తలకు తీవ్ర గాయమైంది. శిశువును వెంటనే శంషాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం శిశువు మృతిచెందాడు. శిశువు మహేందర్ తాత నరసింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● ఐదుగురి అరెస్టు.. రూ.13,720 స్వాధీనం

ఆదిభట్ల, సెప్టంబరు 29: పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసిన ఘటన ఆదిభట్ల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలం రావిరాల శివారులోని వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్నట్లు ఎస్ఓటీ పోలీసులకు సమాచారం వచ్చింది. పోలీసులు దాడిచేసి పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 4సెల్‌ఫోన్లు, రూ13,720 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

496 మందికి గుండె వైద్య పరీక్షలు



ఈకో పరీక్ష చేస్తున్న డాక్టర్ చందులాల్ రాథోడ్

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు29: షాద్‌నగర్‌లోని విజయ కార్డియాక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జనని పిల్లల ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు 496 మందికి గుండె వైద్య నిపుణులు డాక్టర్ చందులాల్ రాథోడ్ పర్యవేక్షణలో రక్త పరీక్షలు, ఈసీజీ, 2డి ఈకో పరీక్షలు చేశారు. శిశువుల నుంచి వృద్ధుల వరకు వచ్చిన వారికి వైద్య పరీక్షలు చేశారు. గుండె జబ్బుల లక్షణాలున్న వారికి జాగ్రత్తలను వివరించారు. గుండె జబ్బులు రాకుండా.. అలాగే వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మందులు రాసిచ్చారు. మద్యం, పొగ తాగొద్దని, మాంసాహారాన్ని తగ్గించాలని సూచించారు. నిత్యం నడక, వ్యాయామం చేస్తే గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులు రావని డాక్టర్ చందులాల్ రాథోడ్ తెలిపారు.

గుండెను పదిలంగా ఉంచుకోవాలి

షాబాద్, సెప్టెంబరు 29: ప్రతి ఒక్కరూ గుండెను పదిలంగా ఉంచుకోవాలని చందనవెల్లి పీహెచ్‌సీ వైద్యురాలు స్వర్ణలత అన్నారు. ఆదివారం వరల్డ్ హార్ట్‌డేను పురస్కరించుకొని చందనవెల్లిలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతీ ఒక్కరు ఆహార అలవాట్లను మార్చుకోవాలన్నారు. మితాహారం, కొవ్వు పదార్థాలు, నూనెలు తక్కువగా ఉన్న ఆహారాన్ని తినాలన్నారు. గుండెపోటు లక్షణాలున్న వారు రెగ్యులర్‌గా వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుండె జబ్బుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పేదలకు అండగా రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్



బాధితులకు ఆర్థిక సాయం చెక్కు అందజేస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్, సెప్టెంబరు 29: కష్టాలో ఉన్న పేదలకు జర్పుల రాధాకృష్ణ ట్రస్ట్ అన్ని విధాలా అండగా ఉంటుందని ట్రస్ట్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు ట్రస్ట్ సేవలను విస్తరిస్తామని పేర్కొన్నారు. కడ్తాల, సాలార్‌పూర్, చల్లంపల్లి, వంపుగూడ గ్రామాల్లో ఆదివారం దశరథ్ పర్యటించి ప్రజాసమస్యలపై తెలుసుకున్నారు. గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. కడ్తాలకు చెందిన జంగమ్మ, సాలార్‌పూర్‌నకు చెందిన చెన్నమ్మ, శివమ్మ, సాయిలు, వంపుగూడకు చెందిన భీమయ్య, కిష్టయ్యల కుటుంబాలకు రూ.30వేల సాయం అందజేశారు. వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, మాజీ ఎంపీటీసీలు ప్రియరమేశ్, సాయిలు, మాజీ సర్పంచ్‌లు హరిచంద్‌నాయక్, కృష్ణయ్య, నాయకులు రామకృష్ణ, నర్సింహ, లాయక్‌అలీ, పంతూ, బాబ, చందు, వెంకటేశ్, జైపాల్, గోపాల్, నరేశ్, ప్రకాశ్, కృష్ణయ్య, మాధవులు, కరుణాకర్, రాజ్‌కుమార్, రాజేందర్ పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే హైడ్రా



మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది కృష్ణాగౌడ్

చేవెళ్ల, సెప్టెంబరు 29: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దలను వదిలి పేదల ఇండ్లను హైడ్రా పేరుతో కూల్చివేయడం చాలా బాధాకరం అని సీనియర్ న్యాయవాది, బీజేపీ చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు గౌండ్ల కృష్ణాగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లు కూల్చడం అన్యాయం అన్నారు. రాజకీయ నాయకులు, సంస్థల ప్రతినిధుల భూ అక్రమాలు వదిలి పేద, మధ్య తరగతి ప్రజల రక్తం కన్నీళ్లు పారించే యత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో 50ఏళ్ల క్రితం కట్టుకున్న ఇళ్లు ఖాళీ చేయాలని అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు అమలుచేయలేకుండా, ప్రజల దృష్టిమళ్లించడానికే హైడ్రాను ప్రారంభించిందని విమర్శించారు. హైడ్రా భయంతో నగరంలో ఇప్పటికే ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారని, ఈ ప్రభుత్వం ఇంకా ఎందరి ప్రాణాలు తీస్తుందని ప్రశ్నించారు. పేదలకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను వదిలకుంటే కాలగర్భంలో కలిసిపోతుందని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ పోరాటం



ఏబీవీపీ నూతన కార్యవర్గ నాయకులు

షాబాద్, సెప్టెంబరు 29 : విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ పని చేస్తుందని పరిషత్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్ తెలిపారు. ఆదివారం షాబాద్‌లో ఏబీవీపీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. సమాజం కోసం పనిచేస్తూ విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేద్దామన్నారు. షాబాద్ నగర అధ్యక్షుడిగా యాదయ్య, నగర కార్యదర్శి మధుకిరణ్, ఉపాధ్యక్షులు ప్రేమ్, విజయ్‌నందు, భవదీష్, సంయుక్త కార్యదర్శులుగా ప్రవీణ్, బాలరాజ్, వరుణ్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా రాజేశ్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మల్లేష్, ప్రణయ్, లోకేశ్, లక్ష్మి, నరసింహ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి తహసీల్దార్‌గా నాగార్జున



నూతన తహసీల్దార్ నాగార్జునను సత్కరిస్తున్న ఆఫీసు సిబ్బంది

తలకొండపల్లి, సెప్టెంబరు 29: తలకొండపల్లి తహసీల్దార్ రంగారెడ్డి బదిలీ అయ్యారు. ఆయనను ఆకస్మికంగా కలెక్టరేట్‌కు బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో కలెక్టరేట్‌లో పనిచేస్తున్న నాగార్జున తహసీల్దార్‌గా వచ్చారు. శనివారం రాత్రి తహసీల్దార్ కార్యాలయంలో చార్జి తీసుకున్నారు. కొత్త తహసీల్దార్ నాగార్జున, బదిలీ అయిన తహసీల్దార్ రంగారెడ్డిలను కార్యాలయ అధికారులు, సిబ్బంది పూల మాలలు, శాలువాలతో సత్కరించారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యేల పరామర్శ



పురుషోత్తమ్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్/ఆమనగల్లు, సెప్టెంబరు 29: నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తమ్‌రెడ్డి మృతదేహాన్ని షాద్‌నగర్, కల్వకుర్తి ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డిలు సందర్శించి నివాళులు అర్పించారు. పురుషోత్తమ్‌రెడ్డి కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఉదయం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేలు వేర్వేరుగా హైదరాబాద్‌లోని సైబర్ టవర్ వద్ద గల ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నివాసానికి చేరుకొని పురుషోత్తమ్‌రెడ్డి మృతదేహంపై పుష్పగుచ్ఛం నివాళులు అర్పించారు. అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



పురుషోత్తంరెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఎస్ఎఫ్ఐ నాయకులపై కేసులు అక్రమం



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

షాద్‌నగర్, సెప్టెంబరు 29 : తమ నాయకులపై అక్రమ కేసులు పెట్టడంపై ఎస్ఎఫ్ఐ ఖండించింది. ఈ మేరకు ఆదివారం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 27న విద్యారంగ సమస్యలపై హైదరాబాద్‌లో నిర్వహించిన మహాగర్జనకు తరలిన వారిపై పోలీసుల అక్రమ కేసులు నమోదు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడం తప్పా? అని ప్రశ్నించారు. తమపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు. సమావేశంలో సమీర్, శివశంకర్, వినయ్, రాధకృష్ణ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



అభ్యాసకులతో మాట్లాడుతున్న అంజయ్య

కేశంపేట, సెప్టెంబరు 29 : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సంతాపూర్ మాజీ సర్పంచ్ బిజ్జారపు అంజయ్య అన్నారు. ఆదివారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా చేయాలని అంజయ్య సూచించారు. యోగా గురువు సత్తయ్య ఆసనాలు వేయించారు. ప్రతొక్కరూ యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భవానీ మాత ఉత్సవాలకు రూ.లక్ష విరాళం



కాశీనాథ్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 29 : ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట భవానీ మాత ఉత్సవాలకు కాంగ్రెస్ నాయకుడు కాశీనాథ్‌రెడ్డి లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. భవానీ మాత ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రాజు, ఆంజనేయ ఆలయ కమిటీ చైర్మన్ దినేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్తులు హైదరాబాద్‌లో కాశీనాథ్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వానాన్ని అందజేశారు. తన వంతుగా ఆయన రూ.లక్ష విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జితేందర్‌రెడ్డి, అర్ల యాదయ్య, కృష్ణయ్య, శ్రీశైలం, శ్రీపాదరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రధాని 'మన్ కీ బాత్'ను వీక్షించిన నాయకులు



టీవీ, మొబైల్ ఫోన్‌లలో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్

శంషాబాద్ రూరల్/ఆమనగల్లు, సెప్టెంబరు 29: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతీ ఆదివారం ప్రజలతో నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ నియోజకవర్గం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో బీజేపీ నాయకులు వీక్షించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్, నాయకులు ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమాన్ని టీవీలు, మొబైల్ ఫోన్లలో వీక్షించారు. దేశ భవిష్యత్తు, సమాజ అభివృద్ధికి ప్రధాని చేసిన సూచనలను శ్రద్ధగా విన్నారు. మనందరం మోదీ చూపిన బాటలో నడవాలన్నారు. ప్రతీ వారం మాధ్యమాల ద్వారా ప్రధాని నేరుగా ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలు వినడం, వివిధ రంగాల్లోని విజయ గాథలను వివరించడం గొప్ప విషయం అన్నారు. నేటి పాలకులకు మోదీ రోల్ మోడల్ అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు కె.మహేశ్‌యాదవ్, స్థానికులు ఉన్నారు. అలాగే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ఆమనగల్లులో మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, అసెంబ్లీ బీజేపీ కో-ఆర్డినేటర్ గోరటి నర్సింహ, కౌన్సిలర్ లక్ష్మణ్, నాయకులు రవిరాథోడ్, పద్మప్రశాంత్, చంద్రయ్య వీక్షించారు.



మన్ కీ బాత్ వింటున్న ఆమన్గల్ నాయకులు



ఇబ్రహీంపట్నం ప్రభుత్వ బాలుర పాఠశాల పూర్వ విద్యార్థులు, ముఖ్య అతిథులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 29 : ఇబ్రహీంపట్నం ప్రభుత్వ బాలుర పాఠశాల 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 25ఏళ్ల తర్వాత ఒక్కటయ్యారు. ఇబ్రహీంపట్నంలోని ఎన్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన అపూర్వ సమ్మేళనంలో వారంతా పాల్గొన్నారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆడిపాడారు. ఆపద సమయాల్లో కలిసి ఉందామంటూ ప్రతిన బూనారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ.రాజు, అప్పటి టీచర్లు కొప్పు జంగయ్య, కె.శ్రీనివాసులు, ప్రస్తుత హెచ్‌ఎం సురేష్ పాల్గొన్నారు.

చేవెళ్ల: మండల పరిధి చన్వెల్లిలోని ప్రభుత్వ పాఠశాల 1997-98 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు గ్రామంలోని ఓ ఫామ్‌హౌస్‌లో సమ్మేళనాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులు నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. 25సంవత్సరాల తర్వాత కలుసుకోవడం సంతోషంగా ఉందని వారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంప్రసాద్, విజయ్‌కుమార్, బల్వంతరెడ్డి, అనంతం, బుచ్చిరెడ్డి, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న చన్వెల్లి పాఠశాల పూర్వ విద్యార్థులు, నాటి టీచర్లు

సాగర్-హైదరాబాద్ రోడ్డును కప్పేస్తున్న చెట్ల కొమ్మలు



రోడ్డుపైకి వచ్చిన కంప చెట్టు

యాచారం, సెప్టెంబరు 29 : హైదరాబాద్-నాగార్జున సాగర్ ప్రధాన రహదారిపై గున్‌గల్ గేట్, రిజర్వ్ ఫారెస్ట్ వద్ద రోడ్ల మలుపుల్లో చాలా చోట్ల చెట్లు రోడ్డుపైకి రావడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనాదారులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ఎదరుగా వచ్చే వాహనాలు కన్పించక ఢీకొట్టడం ఖాయం. గున్‌గల్ గేట్ సమీపంలో సూచికగా రోడ్డుపై పెట్టిన బారికెడ్లు సైతం ధ్వంసమయ్యాయి. సర్కార్ తుమ్మలు, రేగుచెట్ల కొమ్మలు రోడ్డును కప్పేస్తున్నాయి. దీంతో టర్నింగుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. ఇదే చోట ఇటీవల ఓ ద్విచక్రవాహనాదారుడు ఎదుటి వాహనాన్ని తప్పించబోయి స్కిడ్డై పడ్డాడు. రోడ్డుపైకి వస్తున్న చెట్లకొమ్మలను నరికేయించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను వాహనదారులు కోరుతున్నారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

యాచారం, సెప్టెంబరు 29: వివిధ గ్రామ పాఠశాలల నుంచి ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన సభ ఈ నెల 30న(సోమవారం) యాచారంలోని సాయిశరణం గార్డెన్‌లో నిర్వహిస్తామని ఎంఈవో పాండురంగారెడ్డి ఆదివారం తెలిపారు. సన్మానోత్సవానికి ఎంపీడీవో, తహసీల్దార్, ఎంపీవోలు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

.. కో-ఆపరేటివ్ సొసైటీ సర్వసభ్య సమావేశం

యాచారం, సెప్టెంబరు 29: యాచారం ప్యాక్స్ సమావేశం నేడు(సోమవారం) ఉదయం 11:30గంటలకు నిర్వహిస్తామని సీఈవో నాగరాజు తెలిపారు. చైర్మన్ రాజేందర్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని, డైరెక్టర్లు, రైతులు హాజరుకావాలని కోరారు.